# తెలుగు బాల సుకీబవ!

చినకల్లో తడవని మణిసి చుట్టాలుపక్కాలు రాని యిల్లు ఈ బూలోకంలోనే ఉండవేమో!

నా చిన్నతనంలో మాయింటికి చుట్టాలుపక్కాలు వచ్చేవాళ్లు!

చుట్టాలంటే ఏదో ఆడికో అమాసకో చుట్టపుచూపుగా వచ్చిపోతా ఉంటారు. అయితే మిద్దింటోళ్ల చుట్టాలు మాత్రం అట్టాకాదు. వచ్చేవాళ్లు వస్తావుంటారు. పొయ్యేవాళ్లు పోతా ఉంటారు. ఊళ్లోవాళ్లుగూడా మిద్దింటోళ్ల చుట్టాలంటే శానా మట్టుమరేదగా చూసేవాళ్లు. చుట్టపుచూపుగా వచ్చినోళ్లు వొగటిరొండు దినాలు ఉండేసి వచ్చినదోవ పట్టుకోని పోతా వుంటే అది ఎవుర్కైనా బాగుంటింది. అట్టగాకుండా పచ్చంగా ఉండాదని తింటా ఎచ్చంగా పాణుకుంటాఉంటే మాయమ్మకు వొళ్లు రగిలిపొయ్యేది. వాళ్లకు యినిపించీ యినిపించనట్లు 'ఏం బతుకులో పాడు బతుకులు? వచ్చినోళ్లకు వండి పెట్టుకోని రానోళ్లకోసరం ఎదురు చూసే బతుకులు?' అంటా యాష్టపొయ్యేది. అప్పుడు నాకు అర్తంకాలా!

ఇప్పుడు నిద్దర కండ్లతోనే పరిగిత్తేది. రైల్ టేసిన్ కాడ ఎదురుచూస్తా నిలబడు కుండేది. రైలు వస్తానే వచ్చినోళ్లను దింపుకుండేది. కొండమిందికి తీసుకోని పొయ్యేది. పలుబాట్లు పడి వాళ్లకు జరగాల్సిన సకల మరేదలు జరిపించేది. కొండమీదినుంచి దింపుకో నొచ్చేది. మళ్లా రైలెక్కించేది. తిరపతిలో కూసోని దినమ్మ ఈ నిలికి లేని సేద్దిం చేస్తావుంటే మాయమ్మ యాష్ట బాగా అర్తం అవతా ఉండాది.

అందుకేనేమో పెద్దోళ్లమాట చంకలో సద్దికూడు మూట అంటారు.

దినమూ చచ్చేవాడికి ఏడ్చే వాడెవుడని మనఏడుపు మనదిగా వుంటే- యింక పొగిడింపుల కత ఎందుకులే? –

ఏడుకొండలోడి పాదాలకింద ఉండేదే ఒక అదురుష్టమంట!

ఇటు మంటి సేవలు చేసేదానికి పెట్టిపుట్టి ఉండాలంట!!

చెయ్యాలనుకుణ్ణా అది అందురికీ అలివిగాని పనంట!!!

అవునుగదా మరి?. చాకిరి చేసేవాళ్లను చెయ్ పించుకునే వాళ్లు అనాల్సిన మాట్లే గదా? కనీసం యిట్టా రొండు నేర్సిన మాట్లయినా కర్సు పెట్టకపోతే వాళ్లు కారివేదు లెట్టవతారు?

ఇట్టా మాట్లకు బేలిపొయ్ కాదు. పోనీ వాళ్ల సేవలో దేవుడి సేవగూడా జరగతా ఉండాదని కాదు. శాతైనమట్టుకు సెగెతుణ్ణెకాడికి చెయ్యాలనుకుణ్ణా. అదే చేస్తా ఉండా!

అయితే ఈ ఏడుపంతా ఎందుకంటారేమో?

మనగుడ్డ మనం కట్తావుండాం. మన కూడు మనం కుడస్తా వుండాం. మనవల్ల అయిన పని మనం చేస్తావుండాం. అయినా అడ్డమాల్నె నాకొడుకులు ఈడ్సి కొలిస్తే జానా బిత్తెడు లేని యదవలు అడ్డదిడ్డంగా మాట్లాడ్తా ఉంటే పడాల్నే? వాళ్లకు శాతగాదు. శాతయ్యే వాళ్లను చూసి వోర్చుకో లేరు!

గెడ్డివామికాడ కుక్కలంటే యిట్టాంటోళ్లే నేమో?

'ఆ కుక్కల కత ఏం ఉండాదిలే? వాటిపాటికవ్వి మొరుక్కుంటా ఉంటాయి.' అనుకుంటా చదవతా ఉణ్ణె జాబు పక్కన పెట్నా. ఆ జాబు ఆ మొర్నాడు దిగబడబొయ్యే మొనగాడు రాసింది.

సరే! ఏదేమయినా కానీ ఆమర్నాడు తెల్లారే కాడికి రైల్ టేసిన్ కాడికి పోవాలని నిర్దారించుకుణ్ణా!

అయితే ఆమర్నాడు నిద్దర లేచేకుందికి బల్లుమని తెల్లారిపొయ్ వుండాది!

'అయ్యయ్యో! రైలొచ్చేసే యాళయ్‌పొయిందే! బండి దిగేసి మనం కనపడకుండా పోతే వాళ్లు ఎంత యాతన పడిపోతా ఉండారో? ఏం పాడో?' అని నేను యాదనపడ్తా ఎగిరిపడిలేస్తి. ఆదరాబాదరా అన్నీ ముగించు కుంటి. ఎలబార్తా ఉండా.

కంట్లోనిద్దర కంట్లో వుండంగానే అర్బాటం కోడి తోలుగుడ్డు పెట్నెట్టు నా అర్బాటం ఛూసి మా బాశాలి ఎట్నోవొకట్టా నన్ను ముగ్గులోకి ఈడ్సి ముప్పతిప్పలు పెట్టేదే కానీ రేత్రి బిర్రు యింకా సళ్లొదల్లా. అదే సాల్రా నాతండ్రీ! అనుకోని ఒక్క అడుగులో గడప దాట్తి. వీదిలో పడ్తి. బుగ్గ మునిగిపోతా ఉణ్ణెట్టు ఎగబెట్టుకోని పరిగెత్తా ఉండా!

ఆ నాలుగ్గాళ్లమండపం కాడ రైల్ టేసిన్ కాడికి పొయ్యేదానికి మలుపు తిరగతా ఉండా. 'ఒరే! అబ్బోడా!' అని ఎవురో పిల్సినట్టుండె. ఒక్క సెణమట్టా నిలబడ్తి. నిలబడి దిక్కులు చూస్తి!

నాలుగ్గాళ్లమండపానికి ఆపక్కన నిలబడుకోని నన్నేచూస్తా అరస్తా ఉండాడు ఒకాయన. 'ఎవురబ్బా!' అని ఆలోచించినంతసేపు పట్లేదు ఆమణిసి నాదగ్గిరికి వొచ్చేదానికి. ఒక పిలగాడు ఎంటవుండాడు. నా ఎదురుంగా నిలబడుకుణ్ణె మణిసి ఎవురో కాదు గొల్ల గోయిందుమందిడి!

''అరే! అబ్బోడా! అబ్బోడా! ఊళ్లో ఎలబార్తా ఎలబార్తా మిద్దింటోళ్ల అబ్బోడు యాడుంటాడు'' అని మిద్దాళ్లో అడిగితే-

''తిరపతిలో 'నాలుగ్గాళ్లమండపం' అని అడుగు. ఎవుర్ని అడిగినా చెప్తారు. ఆమండపంకాడికిపో. ఆడనిలబడుకోని చిన్నపిలగాణ్ణి అడిగినా చెప్తాడు అని. ఈడికి రేత్రనంగా వచ్చినా. అడగనోడు పాపాత్తుడనుకో!-''

''మిద్దింటోళ్ల అబ్బోడు యాడుంటాడయ్యా?'' అని అడిగితే-

''ఈడ ఉండేవన్నీ మిద్దింఢ్లేనే- యా మిద్దింటోళ్ల అబ్బోణ్ణి నువ్వడిగేది?'' అని. ఎటుమంటి గొల్లోడ్కైనా యాపకాయంత ఎర్రి ఉంటిందంటారు. నిజిమే కదా? కొండ మిందికి పొయ్ మాఅబ్బోణ్ణి చూసినారా? బోడిగుండు కొట్టుకోనుంటాడు. అని ఎతుకులాడినట్టయి పాయనే నా బతుకు! అని యాదన పడ్తావుంటే ఏదేవుడో కనికరించి నిన్నీడికి తీసుకోని వొచ్చినాడు.'' అంటా ఉత్తరంగా తిరుక్కోని రొండు చేతులెత్తి ఒక్క దణ్ణం పెట్టె!

నాపని పల్లేరిగాయల మింద నిలబడుకున్నెట్టు ఉండాది. ఇంకీమణిసితో మాటలు పెట్టుకుంటే అది అయ్యేపొయ్యే పని గాదని-

''గోయిందన్నా! గోయిందన్నా! నేను అర్జింటుగా రైల్ టేసిన్ కాడికి పొయ్ రావాల. నువ్వు ఈడ్నే నిలబడుకోనుండు. ఈడ ఉన్నెట్టే వచ్చేస్తా!'' అని అంటే-

''పొయ్‌నోడు అట్నేపోబాక అబ్బారే! నిన్న మాపటేళనించి నీ కోసరం ఈడ పడి గాపులు గాస్తావుండా.'' అనె.

వదిలిపెట్టిందే చాలనుకుంటి. ఒక్క లగువులో పొయ్ రైల్ టేసిన్లో పడ్తి. వచ్చినోళ్లు నమ్ముకున్నింది దేవుణ్ణి. గొల్ల గోయిందు దేవుడి మాదిర్తో నమ్ముకున్నింది నన్ను. అందుకనే వాళ్లదోవన వాళ్లను దొంగల తోలేస్తి. నాలుగ్గాళ్లమండపంకాడ వొగిటికి నాలుగు కండ్లు నా కోసరం ఎదురుచూస్తా ఉంటాయి అనుకుండే కుందికి నాకాలు నిలవలా. వస్తావుండా.

మిద్దారుకి ఎగదాల ఒక ఊరుండాది. దాన్ని ఎగవ్వూరంటారు. గొల్ల గోయిందుమందిడిది ఆ ఊరే! ఆ ఊళ్లో గోయిందుమందిడికి మందగొర్రెలు మందమేకలు ఉండాయి. బీటి కాలంలో కయ్యిల్లో సత్తవకని మందపెట్తారు. ఆ మూడూళ్లల్లో ఎవురు మంద పెట్టాలన్నా గోయిందుమందిడే దిక్కు!

ఎన్నిట్లో వంచాలేసి పొణుకుండేది. వంతులేసుకోని కావిలిగాసేది. అటుమంటప్పుడు గోయిందుమందిడి ఎటుమంటి ఎటుమంటి కతలు సెప్తా ఉండె! కతలు చెప్తా చెప్తా ఉంటాడు. ఉన్నెట్టుండి నిలిపేస్తాడు.

''ఒరే అబ్బారే! ఆ గెడ్డమింద ఉండాదే? రెప్పాళచెట్టు. దాంట్లో సగిలిగావుండే ఒక బర్ర యించుకోని రాబోరా!'' అనేవాడు.

తేకుండాపోతే కతలు చెప్పడేమో అని బెంగపడి బిరబిర పొయ్ ఒక బర్ర యించుకోని

తెచ్చిస్తే ఆ బఱ్ఱను చిన్నంగా వడేసి వడేసి నలపతా దానిలోపల ఉండే కట్టెను తీసేస్తాడు. అప్పుడు అదివొక బుఱ్ఱ అవితింది. దాన్ని చేతబట్టుకోని మందలోకి పోతాడు. ఆ బుఱ్ఱనిండికి మేకపాలో గొఱ్ఱెపాలో పిండుకోని తెస్తాడు. రెప్పొళపాలు తగిలేకుందికి ఆ పాలు పేరిపాయ్ జున్ను మాదిర్తో అవితింది. ఆ బుఱ్ఱ నా చేతికిచ్చి తిన్రా అబ్బోడా! అనేవాడు.

ఎన్నిట్లో కూసోని కతలు యినుకుంటా ఆ జున్నును కొంచిం కొంచింగా నంజుకుంటా... ఎందుకులే ఆ అనుబోగమే అనుబోగం కదా?

అటువంటి మణుసు గోయిందుమందడిది. ఈ పొద్దు ఆ మణిసి నన్ను ఎతుక్కుంటా వచ్చినాడంటే! ఎందుకబ్బా? అని ఆలోచించుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడికి వచ్చేకుందికి పాపం! కన్నీరు కండ్లు చించుకోని రైల్‌టేసిన్ కల్లానే చూస్తా ఉండాడు.

నన్ను చూస్తానే గోయిందుమందిడి 'వొచ్చినావంట్రా అబ్బోడా' అని బొరోమని ఏడ్చినంత పనిచేసె.

''ఏమన్నా? ఏమయిందన్నా గోయిందన్నా?'' అని అడిగితే-

''ఆ ముండ మాట్లిని నే ముండ మోసుకుంటి గదరా అబ్బోడా!'' అనె.

''ఏముండమాట? చెప్తేనే గదన్నా తెలిసేది!'' అని అనుమానంగా చూసేకుందికి పసిగటేసినాడు మొనగాడు. ''అబ్బోడా! మనపని మనం చేసుకుందామంటే యింట్లో ఆడది యినిపించుకోలా.''

''నువ్వు మేకలు మేపితే నీ బిడ్డగూడా మేకలే మేపాలని యాడన్నా రాసిపెట్టి ఉండాదా? ఊరి ముందర్నే గదా యిస్కూలు. పిలగాణ్ణి రొండచ్చిరాలు నేర్సుకోనీ. చదివించే.'' అని శతపోరె!

ఏపోరన్నా పడొచ్చు. అది యింట్లో పోరు. మింగలేక కక్కలేక మినకరిస్తా ఉంటే-

''ఇస్కూలికి పోతే చాలు. తెల్లారేకాడికి నాస్టా పెడ్తారంట. మద్దేణంకాడ బోజినం పెడ్తారంట. పైటేళకాడ పాలిస్తారంట. పుస్తకాలిస్తారంట. అడపాదడపా డాక్టర్లొచ్చి మొందులూమాకులు యిస్తారంట. ఇన్ని చేస్తావుంటే నీకేం గాడా చదివించే దానికి?'' అంటా దొబ్బితోసె.

''దాని మాట ఎందుకు కాదనాలని యిద్దో యీణ్ణి యిస్కూలుకు పంపిస్తి. వాడూ పడ్తాలేస్తానే పదిదాకా చదువూడ్సె. ఇంకేం పరవాలేదులే. వాడికి అబ్బ సాలు తప్పె. ఊళ్లేలే ఉద్యోగం కాక పోయ్‌నా వాడికి తగిన ఉద్యోగం ఏదోవొగిటి రాకుండా పోతిందా? నూరారు మంది లేరుగదా? ఉండేది యిద్దురు. ఆయిద్దురి కట్టెట్టా కడతేర్సలేకుండా పోతాడా? అని నమ్మినాన బోసుకుంటే పుచ్చి బుఱ్ఱలాయెనే? చదివినోడికంటే చాకలోడు మేలనే కాడి కొచ్చెసెనే బతుకు!'' అంటా యాష్టపడె.

''అదేంది గోయిందన్నా అట్లంటావే? ఈ కాలాన నాలుగచ్చిరాలు నేర్చుకుండే దాంతో సమానమా?'' అంటే-

''ఆ! ఆ! నాలుగచ్చిరాలు కాదు నలభై అచ్చిరాలు నేర్చుకోవాల్సిందే! ఎందుకంటే? యిద్దో యిట్టా నాతాడు తెంపి నాచేతల్లోనే పెట్టేదానికి. పదోతరగతి పాసైనాడంటాడు. ఆకత నాకేం తెల్సు? నాకు తెల్సింది చెప్తాయిను. గొర్రె ఎప్పుడు కట్టు కొస్తిందో తెల్సు. ఎప్పుడు ఈనుతుందో తెల్సు. ఎన్ని పాలిస్తిందో తెల్సు. అమ్మకానికొస్తే ఎంత దరపలికితిందో తెల్సు. ఎదా? ఈ యదవ యింత చదువు చదివినానని కూస్తా ఉండాడు గదా? వాణ్ణి చెప్పమను చూద్దాం. అటుమంటప్పుడు ఎందుకీ చదువులు. చట్టుబండలు?''

నా తల దిమ్మతిరిగి బొమ్మలాటాడె. ఈ ఎర్రి గొల్లోడు అడిగిన మాటకు బొదులు చెప్పే మొనగాడు పుట్నాడా? పుట్టబోతాడా? అని ఆలోచించుకుంటా ఉంటే-

''ఈ మొగలాయి చదివిన సంబడానికి ఏ ఉద్దోగం రాదంట. పోనీ! గొర్లు మేపుకోరా అంటే- 'ఇంత చదువు చదివింది గొర్లు మేపేదానికా?' అంటాడు. ఈ చదువు చదివించే కుందికే నాకు బూసులుగమ్మతా ఉండాది. ఇంక నాచావు యాడ చదరం చేసుకోమంటావ్?''

''అదిగాదు గోయిందన్నా! చదువు కుణ్ణోళ్లంతా ఉద్దోగంకావాలంటే ఎట్టా? అవ్వి చెట్లల్లో కాసే కాయలైతే పరవాలేదు. కోసి తలావొగిటి యిచ్చేయచ్చు. కాదే? అందుకే ప్రెబుత్వం యిట్టా మాదిరి చదువుకోని ఉద్దోగం లేనోళ్లకు ఏదో ఒక ఉపాది కల్పిస్తానంటా ఉండాది కదా?''

''అవున్రా! అబ్బోడా! అవును. కల్పిస్తానంటా ఉండాది. అయితే అది ఏందని అడిగితే గదా? మల్లా గొర్లే పట్టిస్తాం. మేపుకోమంటా ఉండాది. సరే! గొర్లు మేపుకోవాల? బిటీషోడి కాలంనుంచి అంతోయింతో పొరంబోకు యిడ్సిపెట్టా వుండ్రి. ఎందుకు? ఇద్దో యిట్టా గొడ్డూగోదా గొర్రెబర్రె మేపుకుండే దానికి. ఇప్పుడా పొరంబోకుల్లోనే యిండ్లు గట్టుకోమని వోళ్లకూ ఈళ్లకూ యిచ్చేసినారా? ఇంక అడివిలోకి తోల్దామంటే కావిలోళ్ల పొటుకు? అది రంకు మొగుడి పొటుకు!- అసలు కిటుకు నీకు అర్తంకాలా. ఇదంతా యిస్కూళ్లల్లో పిలకాయిలకు కూడు పెడ్తామని బేలించి మా నోటి కూళ్లు పెరికే యవ్వారంలే!'' అనె.

ఆమాటతోగూడా నా గూబ గుయ్‌మనె. అవు గదా మరి? అది సటపటమైన మాటగాదే? ఎర్రిగొల్లోడే ఎంత దూరం ఆలోచించినాడబ్బా? అనుకుంటా ఉంటే అంతలోనే ముత్తారెడ్డన్న వచ్చె.

''గోయిందుమందిడి చెప్పేమాటల్లో గోరంత అపద్దం లేదురా అబ్బోడా లేదు. పెట్టా మనేది పిలకాయిలకు. లచ్చినంగా బొంచేస్తా ఉండేది నడిమిద్దె ఉండే మహన్నబావులు. ఈళ్లేంది? పెట్టేదేంది?- ఆ పెట్టే సెగితి వాళ్ల అబ్బలకు కలగజేస్తే వాళ్లబిడ్డలకు వాళ్లుపెట్టుకోలేరా? కాకిపిల్ల కాకికి ముద్దుగాదా? ఇదెంతా పుండు ఒక చోటుంటే మందు యింకొక చోట యేసే యవ్వారం లేరా!'' అనె.

తెలుగుబాల సుకీబవ! అనుకుంటి. ●